## క్లుప్తంగా

### నేడు ఉచిత కంప్యూటర్ సెంటర్ ప్రారంభం

బన్సీలాల్‌పేట్: సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్(ఎస్ఆర్డీ) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బన్సీలాల్‌పేట్‌లో ఉచితంగా ఏర్పాటు చేస్తున్న కంప్యూటర్ సెంటర్‌ను ఈ నెల 31న (నేడు) మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభిస్తారని సంస్థ ప్రతినిధి శివరాణి ఓ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా మహిళల కోసం మగ్గం వర్క్, బ్యూటీషియన్ శిక్షణ కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. పేదల జీవితాల్లో వెలుగు నింపేలా ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు చేశామని స్థానిక యువత, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### త్వరలో 'బస్తీబాట'

అడ్డగుట్ట: డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఆధ్వర్యంలో త్వరలో 'బస్తీబాట' కార్యక్రమం చేపట్టనున్నట్లు సికింద్రాబాద్ నియోజకవర్గ కన్వీనర్ కాంపల్లి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం అడ్డగుట్టలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్ పరిధిలో అనేక బస్తీల్లో తీవ్రమైన డ్రైనేజీ, కలుషిత నీటి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు బస్తీ సమస్యలను పట్టించుకోకుండా ప్రజల ఆరోగ్యాలను గాలికి వదిలేస్తున్నారని ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం ఇంటింటికీ సీపీఐ అనే నినాదంలో బస్తీబాట కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఉమర్ ఖాన్, బాబు, యాదగిరి, ఎస్‌కే.ఖాజా, శంకరయ్య, రంజిత్ సింగ్, డేవిడ్, నాగరాజు, చాంద్ పాషా, ఎస్‌కే. లతీఫ్, అజీముద్దిన్ పాల్గొన్నారు.

### అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలి

రాంగోపాల్‌పేట్: మెడికల్, క్లినికల్ ల్యాబోరేటరీలు అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తూ రోగుల భద్రత, ఆరోగ్య పరిరక్షణకు పాటు పడవచ్చని పలువురు ప్రముఖులు అభిప్రాయపడ్డారు. సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో ఫౌండేషన్ ఫర్ క్వాలిటీ ఎఫ్‌క్యూఐ పేరుతో రెండు రోజుల సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఈ సదస్సులో భారతీయ మెడికల్ ల్యాబోరేటరీలకు స్టార్ గ్రేడింగ్ ఇవ్వడం ఎలా దాని కోసం పాటించాల్సిన ప్రమాణాలు తద్వారా రోగులకు అందే ప్రయోజనాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అమెరికాలో ఉన్న సీఎల్ఎస్ఐ మార్గదర్శకాలను భారదేశంలో ప్రవేశపెట్టడంతో అనేక ఉపయోగాలు ఉంటాయన్నారు. ల్యాబ్‌ల సేవలు మెరుగుపడటం, సరసమైన ధరలకు ల్యాబ్ పరీక్షలు లభించడం, రోగులకు భద్రత పెరగడం వంటి లాభాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఎల్ఎస్ఈ చెందిన డాక్టర్ పాట్రిక్ మటెటా, హెచ్‌పీఐ డైరెక్టర్ జనరల్ గిరిదర్ జే గ్యాని, కిమ్స్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ భాస్కర్, ఐక్యూఐ డాక్టర్ తుప్పిల్ వెంకటేష్, ఎఫ్‌క్యూ డైరెక్టర్ డాక్టర్ ఆనంద్, వాసుదేవరావు పాల్గొన్నారు.

### డైరీల ఆవిష్కరణ

సనత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర అర్చక, ఉద్యోగ ఐక్య కార్యాచరణ సమితి డైరీని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సోమవారం ఆవిష్కరించారు. అర్చక, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అన్నివిధాలా కృషి చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ పరాశరం రవీంద్రాచార్యులు, ఉద్యోగ సంఘం అధ్యక్షులు కాండూరి కృష్ణమాచార్యులు, టి.రాజేశ్వరశర్మ, బండారు జగపతి తదితరులు పాల్గొన్నారు.

- తెలంగాణ నాన్-గెజిటెడ్ వెటిరినెరియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆవిష్కరించారు. ఉద్యోగులందరూ తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సురేష్, రతన్, అభిషేక్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, అజీముద్దీన్ బాషా పాల్గొన్నారు.

### బడ్జెట్ పై అసెంబ్లీలో చర్చించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ బడ్జెట్ పై రానున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని పీడీఎస్‌యూ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం వివిధ కాలేజీల విద్యార్థులతో జరిగిన సమావేశంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ పీడీఎస్‌యూ నేతలు ఓయూ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

### 'గాంధీమార్గం' పుస్తకావిష్కరణ

లాలాపేట: తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్లో తార్నాక రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, సెంటర్ ఫర్ సోషల్ డైలాగ్ సంయుక్తాధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతిని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ డా.ఆయాచితం శ్రీధర్ పాల్గొని గాంధీ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం గాంధీమార్గం (ద పాత్ ఆఫ్ గాంధీ) అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గాంధీ మహాత్ముడు సూచించిన సత్యం, అహింసా మార్గం అన్ని వేళలు, కాలాలకు ఆచరణీయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామకిషోర్, మోతే శోభన్‌రెడ్డి, మోహన్‌రావు, డా. ఏ. రఘుకుమార్, ప్రొఫెసర్ టి. తిరుపతిరావు, డా. టీపీ రావు పాల్గొన్నారు.

# 20 ఏళ్ల గోడు.. ఆలకించండి సార్లు!



- రెండు దశాబ్దాల నుంచి హాస్పిటల్ కోసం పోరాటం
- 20 వేల జనాభాకు అందుబాటులో లేని వైద్యం
- బస్తీ దవాఖానాకు నోచుకోని వడ్డెర బస్తీ
- ఆస్పత్రి నిర్మించకుంటే ఎన్నికలో పాల్గొనమంటూ స్పష్టం



మాణికేశ్వర్‌నగర్(వడ్డెర బస్తీ)

లాలాపేట: ప్రజలకు మెరుగైన వైద్యం కోసం బస్తీ, కాలనీల్లో రూ. కోట్లు ఖర్చు చేసి ఆస్పత్రులు నిరిస్తున్నా కొన్ని ప్రాంతాల్లో వాటి ఊసే లేదు. వివిధ రకాల అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ఇతర ప్రాంతాలకు వెళ్లి వైద్య సేవలు పొందుతున్నామని ఉస్మానియా యూనివర్సిటీకి కూతవేటు దూరంలో ఉన్న మాణికేశ్వర్‌నగర్ (వడ్డెరబస్తీ) ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రాంతంలో ఆస్పత్రి ఏర్పాటు చేయాలని 20 ఏళ్లుగా ప్రజా ప్రతినిధులు, అధికారులతో మొర పెట్టుకుంటున్నా ఏ ఒక్కరూ స్పందించడం లేదని వాపోతున్నారు. ఈ 20 ఏళ్లలో నాలుగు సార్లు ఎన్నికలు జరిగాయి. నాయకులు మారినా మా గోడును మాత్రం ఎవరూ వినడం లేదని వాపోతున్నారు. ఎన్నికల సమయంలోనే ఆస్పత్రి నిర్మిస్తామని కేవలం హామీలతో సరిపెట్టినా నాయకులు దానిగురించి పట్టించుకోవడమే లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్నారు. కానీ హైదరాబాద్ నగరంలోనే కనీస వైద్య సదుపాయం లేని ప్రాంతం సికింద్రాబాద్ నియోజక వర్గం పరిధిలో ఉండటం గమనార్హం. ఇక్కడ కనీసం బస్తీ దవాఖానాను సైతం ఏర్పాటు చేయకపోవడంపై విస్మయానికి గురి చేస్తోంది.

#### 15 వేల ఓటర్లు, 20 వేల జనాభా..

తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని మాణికేశ్వర్ నగర్‌లో 15 వేలకు పైగా ఓటర్లు, దాదాపుగా 20 వేల మంది జనాభా ఉన్న ఈ ప్రాంతంలోని ప్రజలకు కనీస వైద్య సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారు. ఏదైనా అనారోగ్యం వచ్చిందంటే ఈ ప్రాంత ప్రజలు సీతాఫల్‌మండి, వారాసిగూడ, ముషీరాబాద్ ప్రాంతాలకు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుంది. పక్కనే ఉన్న వారాసిగూడకు వెళ్లడానికి అడ్డుగా ఉన్న రైలు ట్రాక్ దాటి వెళుతున్న క్రమంలో పలువురు ప్రమాదాల బారిన పడి మృతి చెందిన సంఘటనలు చాలానే ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఉన్నవారందరూ కూలీ చేసుకుంటూ జీవనం సాగించేవారే అధికంగా ఉంటారు. స్థానికంగా ఉన్న ఒకటి రెండు చిన్నపాటి క్లినిక్‌లను ఆశ్రయించి ప్రాణాల మీదికి తెరుచుకున్న సంఘటనలు కూడా ఉన్నాయి.

#### ఏ ఎన్నికల్లో ఎక్కడ కలుపుతారో..

మాణికేశ్వర్‌నగర్ గతంలో ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలో ఉండేది. ఆ ప్రాంత ప్రజా ప్రతినిధులు అభివృద్ధి కోసం ప్రయత్నాలు మొదలు పెట్టే సరికి నియోజకవర్గాల పునర్విభజనలో ఈ ప్రాంతాన్ని సికింద్రాబాద్ నియోజకవర్గంలో విలీనం చేశారు. ఇలా సీతాఫల్‌మండి మున్సిపల్ డివిజన్‌లో కొంత కాలం ఓటర్లుగా పరిగణించబడ్డారు. మున్సిపల్ డివిజన్ల ఏర్పాటులో ప్రస్తుతం తార్నాక డివిజన్ పరిధిలో మాణికేశ్వర్‌నగర్ కొనసాగుతుంది. ఏ ప్రాంతానికి వెళ్లినా ఇక్కడి సమస్యలకు పరిష్కారం మాత్రం లభించడం లేదు. మరి రాబోయే రోజుల్లో ఎన్నికల్లో ఇంకా ఏ ప్రాంతానికి కలుపుతారో తెలియడం లేదని బస్తీవాసులు అయోమయానికి గురవుతున్నారు.

#### ప్రతిపాదనలకే పరిమితం..

2003-04లో మాణికేశ్వర్‌నగర్ ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉండేది. అప్పటి ఎమ్మెల్యే లక్ష్మణ్ ఆధ్వర్యంలో మాణికేశ్వర్‌నగర్‌లోని కమాన్ పక్కన 16 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టి పునాదుల వరకు పనులు వచ్చి నిలిచిపోయాయి. సమైఖ్య రాష్ట్రంలో 2009లో సీఎంగా దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అప్పటి ఆరోగ్య శాఖ మంత్రి దానం నాగేందర్ మాణికేశ్వర్‌నగర్‌లో హాస్పిటల్ నిర్మాణానికి నిధులు మంజురు చేశారు. కానీ పనులు ప్రారంభమే కాలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన అనంతరం సికింద్రాబాద్ శాసన సభ్యులు పద్మారావుగౌడ్, తార్నాక కార్పొరేటర్ ఆలకుంట సరస్వతిహరి (మాణికేశ్వర్‌నగర్ నివాసి) హాస్పిటల్ నిర్మాణం కోసం భూమి చదును చేస్తుండగా యూనవిర్సిటీ అధికారులు అభ్యంతరం తెలపడంతో ఆగిపోయింది. ఇలా పలుమార్లు మాణికేశ్వర్‌నగర్‌లో ప్రభుత్వ హాస్పిటల్ నిర్మాణం ముందుకు సాగడం లేదు.



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రమిస్తున్న కాలనీవాసులు (ఫైల్)



ఇటీవల ఆస్పత్రి అంశంపై పద్మారావుగౌడ్‌తో మొర పెట్టుకుంటున్న దృశ్యం

#### మంత్రి కిషన్‌రెడ్డి ఆర్నెల్లు అన్నారు..



తమ బస్తీలో హాస్పిటల్ నిర్మాణం చేయాలని 20 ఏళ్లుగా ప్రజా ప్రతినిధులకు వినతులు ఇస్తూనే ఉన్నాం. 2019లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆర్నెల్లలో హాస్పిటల్ ఏర్పాటుపై చర్యలు తీసుకుంటామన్నారు. కానీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. తాజాగా డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌కు ఆస్పత్రి విషయమై విన్నవించాం. ఇప్పటికైనా తమ బస్తీలో ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

–ఏ. శ్రీనివాస్, మాణికేశ్వర్‌నగర్ వాసి

#### వచ్చే ఎన్నికలో పాల్గొనం..



ఉస్మానియా యూనివర్సిటీ నిర్మాణంలో తమ పూర్వీకులు సేవలందించారు. స్వరాష్ట్రం కోసం ఓయూ కేంద్రంగా సాగిన తెలంగాణ ఉద్యమంలో బస్తీ వాసులమంతా ప్రత్యక్షంగా పాల్గొన్నాం. రాష్ట్రం ఏర్పాటయ్యాక తమ బస్తీని ఎవరూ పట్టించుకోవడం లేదు. తమ బస్తీలో ఉన్న ఖాళీ స్థలంలో హాస్పిటల్ నిర్మాణం చేయాలని కోరితే ఓయూ అధికారులు సైతం వ్యతిరేకించడం దారుణం. తమ ప్రాంతంలో ఆస్పత్రి నిర్మాణం చేయకుంటే వచ్చే ఎన్నికల్లో ఓటింగ్‌లో పాల్గొనం.

–ఆలకుంట లింగయ్య, మాణికేశ్వర్‌నగర్ వాసి

### వీసీ దిష్టిబొమ్మ దహనం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో సోమవారం వీసీ ప్రొ.రవీందర్ దిష్టి బొమ్మతో యూనివర్సిటీ లైబ్రరీ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు శవయాత్ర నిర్వహించి దహనం చేశారు. పీహెచ్‌డీ ప్రవేశాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం చేస్తున్న వీసీని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. పీహెచ్‌డీ అర్హత మార్కుల శాతాన్ని తగ్గించే వరకు ఆందోళనలు కొనసాగుతాయని విద్యార్థి నాయకులు హెచ్చరించారు.

### అర్హులకు పింఛన్లు ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న సామల హేమ

సికింద్రాబాద్: అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేయాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయ పరిపాలనా అధికారి సునీల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దరఖాస్తు దారుల పరిశీలన పూర్తి చేసినప్పటికీ పలువురు లబ్ధిదారులకు పింఛన్లు మంజూరు కావడం లేదన్నారు. వితంతువులు, వృద్ధులు పింఛన్లు అందక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. చిలకలగూడ సుభాష్‌నగర్‌లో మిగిలిపోయిన 'డబుల్' ఇళ్లను అర్హులకు అందించాలన్నారు.

### రిపబ్లిక్ పరేడ్‌లో ప్రతిభ



సనత్‌నగర్: బేగంపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్‌సీసీ విద్యార్థి ఏఆర్.సులోచనాదేవి ఏడో తెలంగాణ గరల్స్ బెటాలియన్ సీనియర్ అండర్ ఆఫీసర్‌గా న్యూఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ పరేడ్‌లో పాల్గొని ప్రతిభను చాటింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి కాంటిన్‌జెంట్ లీడర్‌గా ఆమె సేవలందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి, లెఫ్టినెంట్ శిల్పవల్లి సులోచనాదేవిని అభినందించారు.

## అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, సమస్యల పరిష్కారానికి యువత, కాలనీ సంఘాలు కలిసి రావాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో సోమవారం ఆయన కార్పొరేటర్ హేమలత, వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటిస్తూ సీసీనగర్‌లో రూ. 46.5లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన కమ్యూనిటీహాల్‌కు శంకుస్థాపన, గాంధీనగర్‌లో వీడీసీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ఆయా ప్రాంతాల్లోని సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. బస్తీలు, మురికివాడల్లో పేదలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేలా యువత చొరవ చూపాలన్నారు. బన్సీలాల్‌పేట్ బండమైసమ్మ నగర్ ప్రాంతాన్ని ఓ మోడల్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.బన్సీలాల్‌పేట్ ప్రాంతంలో యువత ఓ సంఘాన్ని ఏర్పాటు చేసుకొని సమస్యలపై ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఆయా ప్రాంతాల్లో మంత్రి పర్యటిస్తుండగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రాత్రి సమయంలో చాలా మంది ఖాళీ స్థలాల్లో కూర్చొని మద్యం, గంజాయి తాగుతూ న్యూసెన్స్ చేస్తున్నారని, రాత్రి వేళల్లో బయటకు రావాలంటే భయంగా ఉందని పలువురు మహిళలు మంత్రికి తెలిపారు. బండమైసమ్మనగర్‌లో డ్రైనేజీ, మంచినీరు, రోడ్లతో పాటు కమ్యూనిటీహాల్ నిర్మాణం, లైబ్రరీ ఏర్పాటు చేయాలని బన్సీలాల్‌పేట్ సేవా సంఘం ప్రతినిధులు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డి, జలమండలి జీఎం రమణారెడ్డి, జీహెచ్ఎంసీ ఈఈ సుదర్శన్, తహసీల్దార్ శైలజ, ఏఈ నవీన్ పాల్గొన్నారు.

## ప్రతిభా అవార్డుల గ్రహీతలకు అభినందన



అవార్డులు అందుకున్న బృందాన్ని అభినందిస్తున్న దెబష్మిత బెనర్జీ

సికింద్రాబాద్: రైల్వే, రక్షణదళం సికింద్రాబాద్ డివిజన్‌కు చెందిన పలువురు అధికారులు, ఉద్యోగులు సమర్థవంతమైన విధులు నిర్వహించి ఉన్నతాధికారుల నుంచి అవార్డులు అందుకున్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అవార్డులు అందుకున్న అధికారులు, ఉద్యోగులను సోమవారం తన కార్యాలయంలో ఆర్‌పీఎఫ్ డివిజన్ సెక్యూరిటీ కమిషనర్ దెబష్మిత బెనర్జీ అభినందించారు. రైల్వే ఆస్తుల పరిరక్షణ, సుదీర్ఘకాలంగా సమర్థవంతమైన సేవలు అందించడం వంటి వివిధ విభాగాల్లో మెరిటోరియల్ అవార్డులను సికింద్రాబాద్ డివిజన్ అధికారులు అందుకున్నారు. అంకితభావంతో సుదీర్ఘకాలం సేవలు అందించిన విభాగంలో ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవిబాబు, ఏఎస్ఐ ఆర్.శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్ యు.సీమ అవార్డులు అందుకున్నారు. ప్రమాదకర పరిస్థితుల నుంచి ప్రయాణికుల ప్రాణాలు కాపాడిన విభాగం నుంచి ఏఎస్ఐ కోటేశ్వర్‌రావు, కానిస్టేబుళ్లు పి.రమేశ్, దినేష్‌సింగ్, నీల్‌కమల్, గిరిరాజ్, ప్రసాద్‌కు ప్రతిభా అవార్డులు లభించాయి. దొంగిలించబడిన ప్రయాణికుల వస్తువులు రికవరీ చేయడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్‌పీఎఫ్ మహిళా ఎస్ఐలు వి.ప్రజ్ఞ, శ్రావణిరెడ్డి అవార్డులు అందుకున్నారు.

## సమస్యలు పరిష్కరించకుంటే కార్యాలయాన్ని ముట్టడిస్తాం



రాంగోపాల్‌పేట్: మంత్రి కేటీఆర్ ప్రతి రోజు బంగారు తెలంగాణ అంటూ ప్రసంగాలు చేస్తున్నారని రెజిమెంటల్‌బజార్‌కు వస్తే బంగారు తెలంగాణ, మురుగు తెలంగాణో ప్రజలు చూపిస్తారని మోండా మార్కెట్ కార్పొరేటర్ కొంతం దీపిక విమర్శించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు సోమవారం ఆమె రెజిమెంటల్‌బజార్‌లోని సిమ్రాన్ పార్కు వెనుక వైపు బస్తీలో పర్యటిస్తూ మాట్లాడారు. ఈ మురుగు నీటి సమస్యపై పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు బంగారు తెలంగాణ అంటూ గొప్పలు చెబుతున్నా మురుగు నీటి కూపాలుగా బస్తీలు కనిపిస్తున్నాయని తాము ప్రజల పక్షాన ఎంత పోరాడుతున్నా అధికారుల్లో చలనం రావడం లేదన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించకపోతే జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

### ఐజీయూ స్టూడెంట్ చాప్టర్ ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ జియోఫిజిక్స్ విభాగంలో నూతనంగా ఇండియన్ జియోఫిజికల్ యూనియన్ (ఐజీయూ) స్టూడెంట్ చాప్టర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐజీయూ-శ్రీ ఎల్ఎస్ కైలాసం పేరు మీద ఏర్పాటు చేసిన స్మారక ఉపన్యాసంలో జీఎస్ఐ మాజీ సైంటిస్ట్ డా.డీవీ రమణ మాట్లాడారు. జియోఫిజిక్స్ విభాగంలోని ప్రొ.వీఎల్ఎస్ భీమశంకరం సెమినార్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి సైన్స్ కాలేజీ ప్రిన్సిపల్, ఐజీయూ లోకల్ కోఆర్డినేటర్ ప్రొ.వీరయ్య అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐ డైరెక్టర్ డా.ప్రకాష్‌కుమార్, గౌరవ అతిథిగా ఐజీయూ ఉపాధ్యక్షులు, సైంటిస్ట్ డాక్టర్ వీఎం తివారీ, విశిష్ట అతిథిగా ఐజీయూ సెక్రటరీ డాక్టర్ అభయ్‌రామ్ బన్సల్ పాల్గొని స్టూడెంట్ చాప్టర్‌ను ప్రారంభించి మాట్లాడారు. అనంతరం పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలో విజేతలకు సర్టిఫికెట్లను అందజేశారు.

### పసికందుకు వైద్యం చేయడంలో నిర్లక్ష్యం

ఆస్పత్రి ఎదుట ఆందోళన

అమీర్‌పేట: నవజాత శిశువుకు చికిత్స చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ ఎస్ఆర్‌నగర్‌లోని సౌమ్య ఆస్పత్రి ఎదుట బాధితులు ఆందోళనకు దిగారు. బాధితుల వివరాల ప్రకారం.. మెహిదీపట్నం మురాద్‌నగర్‌కు చెందిన ఎండీ షఫీ భార్య ప్రసవం కోసం యూసుఫ్‌గూడలోని ఫెమికేర్ ఆసుపత్రికి రాగా వారు సౌమ్య ఆసుపత్రికి రెఫర్ చేశారు. గత నెల 8వ తేదీన ఆసుపత్రిలో చేరగా ఏడు నెలలకే ప్రసవం చేశారు. పసికందును ఐసీయూలో పెట్టి చికిత్స అందిస్తున్నారు. రూ.10 లక్షల వరకు బిల్లు చేయగా ఇందులో రూ.6.8 లక్షలు చెల్లించారు. పాప ఆరోగ్యం కుదుట పడుతుందని చెప్పి ఇప్పుడేమో పరిస్థితి విషమంగా ఉందని, వేరే ఆసుపత్రికి వెళ్లాలని సూచించడంతో ఆగ్రహానికి గురైన బాధితులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితులకు సర్దిచెప్పి పాపను నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు.

### పాస్‌పోర్టు కార్యాలయం సందర్శన




పాస్‌పోర్ట్ సిబ్బందితో ఆశిష్‌కుమార్ సిన్హా

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయాన్ని జీ-20, మినిస్ట్రీ ఆఫ్ ఎక్స్‌టెర్నల్ ఎఫైర్స్, సంయుక్త కార్యదర్శి ఆశిష్ కుమార్ సిన్హా సోమవారం సందర్శించారు. సికింద్రాబాద్ కార్యాలయానికి వచ్చిన ఆయన పాస్‌పోర్టు కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా పాస్‌పోర్టు అధికారులు, సిబ్బంది తయారు చేసిన జీ-20 లోగోను ఆయన సందర్శించారు.

## లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ ఫలాలు



చెక్కులు అందజేసిన పద్మారావుగౌడ్

అడ్డగుట్ట: దళారీల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఇళ్లకే సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ పేర్కొన్నారు. అడ్డగుట్ట డివిజన్‌లోని శాంతినగర్, ఇందిరనగర్, తుకారాంగేట్, అడ్డగుట్ట సీ.డీ సెక్షన్లలో సోమవారం ఆయన పర్యటిస్తూ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి బీఆర్ఎస్ పార్టీ పెద్దపీట వేస్తుందన్నారు. అర్హులైన ప్రజలందరూ ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నల్లపోచమ్మ దేవాలయం(రెండు గుళ్ల) బస్తీవాసులు రోడ్డు, డ్రైనేజీ, తాగునీరు తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా తన దృష్టికి వచ్చిన సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరం, అడ్డగుట్టలో రూ. 2.25 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్ పనులను పర్యవేక్షించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి, నేతలు కిషోర్‌గౌడ్, లింగాని శ్రీను, శ్రీనివాస్ గౌడ్, అంజయ్య, అమర్, శివ కుమార్, నాగేష్‌గౌడ్, సునీల్ ముదిరాజ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

**తార్నాకలో..**

లాలాపేట: తార్నాక బిగ్‌బజార్, చింతల్ బస్తీ, లాలాపేట, వినోభానగర్, లక్ష్మీనగర్, శ్రీపురి కాలనీ తదితర ప్రాంతాలకు చెందిన వారికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులను సోమవారం పద్మారావుగౌడ్ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డితో కలిసి అందజేశారు. తార్నాక చింతల్ బస్తీలో ఓపెన్ నాలాపై స్లాబ్ నిర్మాణానికి రూ. 72 లక్షల నిధులు మంజూరు చేస్తామని సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మోతే శోభన్‌రెడ్డి, సునీల్ ముదిరాజ్, మల్లికార్జున్, వంజరి వెంకటేష్, శివశంకర్ పాల్గొన్నారు.

## సమాచార వ్యవస్థలో భాషల ప్రాముఖ్యత గొప్పది



వక్తలను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఉస్మానియా యూనివర్సిటీ: విజ్ఞానాన్ని రాబోయే తరాలకు అందించేందుకు సమాచార వ్యవస్థలో భాష చాలా శక్తి మంతమైందని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. గణేష్ అన్నారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల హిందీ విభాగం సౌజన్యంతో సీతాఫల్‌మండి డిగ్రీ కళాశాల, గురు విద్యాపీట్ ఆధ్వర్యంల్లో ప్రసార మాధ్యమంలో భారతీయ భాషల ప్రాముఖ్యత అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రొ. గణేష్ మాట్లాడుతూ.. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలతో పాటు నేటి కాలంలో సోషల్ మీడియా ప్రభావం ఎక్కువైందని వీటిలో భాష ప్రాముఖ్యత చాలా గొప్పదన్నారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల హిందీ డిపార్టుమెంట్ హెడ్ ప్రొఫెసర్ మాయాదేవి మాట్లాడుతూ.. హిందీ భాషలో విద్యనభ్యసించిన వారికి పుష్కలమైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. సెమినార్‌లో సీతాఫల్‌మండి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.రామ్‌చందర్, డా.స్వామినాథన్, వికాష్ శర్మ, సులక్షణ, రేఖా శర్మ, డా. అనుపమ, నమ్రతా, డా.సంగీతా వ్యాస్, డా. అజయ్, డా. రాజ్‌కుమార్, డా. భాస్కర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

### బాపూజీకి ఘన నివాళి

మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లోని గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు తమ తమ కార్యాలయాల్లో మహాత్మాగాంధీ చిత్రపటాలు ఏర్పాటు చేసి పూలమాలలతో నివాళి అర్పించారు. – సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం



గాంధీకి నివాళి అర్పిస్తున్న మంత్రి తలసాని



గాంధీభవన్‌లో.. సనత్‌నగర్ కాంగ్రెస్ నాయకులు



గాంధీ చిత్రపటానికి నివాళి అర్పించిన మర్రి రాజశేఖర్ రెడ్డి



మహాత్మాగాంధీకి నివాళులర్పిస్తున్న కంది శైలజ